

ఉష్ణోగ్రత
గరిష్ఠం 40.3
కనిష్ఠం 19.9



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

» రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డిమాండ్
» కలెక్టరేట్ ఎదుట ధర్నా, డీఆర్వోకు వినతి

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రెండు లక్షల వరకు, ఆపై ఉన్న రైతులందరికీ సంపూర్ణ రుణమాఫీ చేయాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కె. మాధవరెడ్డి, కార్యదర్శి ప్రభులింగం డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఇందులో భాగంగా డీఆర్వో సంగీతకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ సాగుకు యోగ్యమైన భూములకు యుద్ధ ప్రాతిపదికన రైతుభరోసా కింద పెట్టుబడి సాయం బ్యాంకులో జమచేయాలని తెలిపారు. రాష్ట్రస్థాయి పంటల బీమా పథకాన్ని ఏర్పాటు చేసి అమలు చేయాలని, వర్షాలు, వడగండ్లకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి వరి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. 55 ఏళ్లు నిండిన ప్రతీ రైతుకు రూ.10 వేలు పింఛన్ ఇవ్వాలని, జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం ముసాయిదాను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి రూ.6 వేల నుంచి రూ.18 వేలకు పెంచి వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో రైతులు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ప్రహరీ లేక పరేషాన్!

ప్రధాన రోడ్డుకు ఆనుకొని
కేశంపేట ప్రాథమిక పాఠశాల
నిర్మాణానికి నోచని కాంపౌండ్ వాల్
వేగంగా వెళ్తున్న వాహనాలు
భయాందోళనలో విద్యార్థులు



8

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ఎక్కడ చూసినా సన్నబియ్యం.. సందడి కనిపిస్తోంది. బియ్యం నాణ్యంగా ఉండటంతో కనీవినీ ఎరగని రీతిలో రేషన్‌దుకాణాల వద్ద ప్రజలు బారులు దీరుతున్నారు. దీంతో ఈ నెలలో రేషన్ బియ్యం పంపిణీ కొత్త రికార్డులు సృష్టించింది. దొడ్డు బియ్యం సరఫరా చేసే సమయంలో సాధారణంగా ప్రతీనెల 60 నుంచి 70శాతం కార్డుదారులు మాత్రమే రేషన్ తీసుకునే వారు. కానీ ప్రస్తుతం సన్న బియ్యం నేపథ్యంలో పది రోజులు కూడా కాకముందే 70శాతం పంపిణీ పూర్తయింది. రంగారెడ్డి జిల్లాలో గతంలో ఎప్పుడూ లేని విధంగా సగటు కోటాకు మించి బియ్యం సరఫరా జరిగింది.



ఫరూఖ్‌నగర్ మండలం చించోడులో బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్



సన్నబియ్యం.. సంబురం

ఉమ్మడి జిల్లాలో రికార్డు స్థాయిలో పంపిణీ

తొమ్మిది రోజుల్లో 70శాతం పంపిణీ పూర్తి
రేషన్ దుకాణాల వద్ద జనం బారులు
రంగారెడ్డి జిల్లాలో సగటుకు మించి సరఫరా
ఇప్పటికే 90 శాతం పూర్తి..
ఆనందం వ్యక్తం చేస్తున్న కార్డుదారులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు పంపిణీ చేస్తున్న సన్న బియ్యం కోసం దుకాణాల వద్ద జనం ఎగబడుతున్నారు. దొడ్డుబియ్యం సరఫరా చేసే సమయంలో ప్రతీ నెలా మొదటి పక్షం రోజుల్లో 50 శాతం రేషన్ పంపిణీ జరిగితే అదే గొప్ప. అయితే ఈనెల సన్నబియ్యం పంపిణీ నేపథ్యంలో రికార్డు స్థాయిలో బియ్యాన్ని తీసుకెళ్తున్నారు. సన్నబియ్యంపై ప్రజలు ఆసక్తి కనపరచడంతో రేషన్ షాపులన్నీ కళకళలాడుతున్నాయి. చౌకధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ ప్రారంభించి 10 రోజులు కూడా

మిగతా 7వ పేజీలో...

మూడు జిల్లాల్లో రేషన్ పంపిణీ ఇలా..

జిల్లా	రేషన్ షాపులు	ఆహార భద్రతకార్డులు	ప్రతినెలా పంపిణీ (మెట్రిక్ టన్నుల్లో)
రంగారెడ్డి	936	5,81,410	14,500
మేడ్చల్	619	5,30,590	10,000
వికారాబాద్	588	2,63,573	5,582

సన్నబియ్యం బాగున్నాయి



రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేస్తున్న సన్న బియ్యం బాగున్నాయి. ఇన్నాళ్లు దొడ్డు బియ్యం తినలేక ఇబ్బందులు పడ్డాం. సన్న బియ్యం పంపిణీ ఆపకుండా నిరంతరం సరఫరా చేయాలి. సన్నబియ్యం ఇవ్వడంతో ప్రతీ ఇంట్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

-యాదమ్మ, మేడ్చల్ పట్టణం





హనుమంత వాహన సేవలో బాలాజీ

కొనసాగుతున్న చిలుకూరు బ్రహ్మోత్సవాలు

» నేడు స్వామివారి కల్యాణం

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టాలైన గోవవాహన, హనుమంత వాహన సేవలు బుధవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారు ఆయా వాహనాలపై ఆశీనులై భక్తులకు దర్శనమిచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. ఉత్సవాల్లో కీలకమైన స్వామివారి కల్యాణాన్ని నేడు (గురువారం) నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్.రంగ రాజన్ తెలిపారు.

దరఖాస్తుకు తుది గడువు పొడిగింపు

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : 2025-26 అగ్నివీర్‌లోని వివిధ పోస్టుల కోసం నిర్వహించే ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ రిజిస్ట్రేషన్ గడువును పొడిగించినట్లు భారత ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే 2025-26 నియామక సంవత్సరానికి అగ్నివీర్ (అన్నివర్గాలు), జూనియర్ కమిషన్ ఆఫీసర్లు, ఇతర ర్యాంకులకు నోటిఫికేషన్ విడుదలైనట్లు తెలిపారు. జిల్లాలోని యువతీ యువకులు భారత సైన్యంలో చేరేందుకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఔత్సాహికులు దరఖాస్తు చేసుకునేందుకు రిజిస్ట్రేషన్ గడువు పెంచిందని, జిల్లాలోని నిరుద్యోగులు, అర్హత కలిగిన వారందరూ వెబ్ పోర్టల్‌లో ఏప్రిల్ 25 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఇక చకచకా..!

15 నిమిషాల్లోపే రిజిస్ట్రేషన్

నేటి నుంచి కొత్త విధానానికి శ్రీకారం
స్లాట్ బుక్ చేసుకోవడం తప్పనిసరి
ఉమ్మడి జిల్లాలో ఆరు చోట్ల ప్రయోగాత్మకంగా అమలు

రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అవినీతికి ఆస్కారం లేకుండా త్వరగా ఈ ప్రక్రియ పూర్తయ్యేలా స్లాట్ బుకింగ్ విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ నూతన విధానం ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ 15 నిమిషాల్లోపే పూర్తయ్యేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. ఈ విధానాన్ని ఉమ్మడి జిల్లాలో ఆరు చోట్ల ప్రయోగాత్మకంగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇక్కడ విజయవంతమైతే మిగతా ప్రాంతాల్లో కూడా అమలు చేయాలని యోచిస్తోంది.



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి): ఆస్తుల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను మరింత స్పీడ్‌గా, వేగవంతం, పారదర్శకంగా చేసేందుకు ప్రభుత్వం కొత్త విధానాన్ని నేటి నుంచి అమల్లోకి తీసుకువచ్చింది. దీనిని ఉమ్మడి జిల్లాలో ఆరు చోట్ల ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఏర్పాట్లు చేసింది. కొత్త విధానంలో అన్ని రకాల రిజిస్ట్రేషన్లకు ఇక మీదట ముందుగానే స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. స్లాట్ బుకింగ్ ప్రస్తుతం సేల్ డీడ్, గిఫ్ట్‌డీడ్, మార్టిగేజ్ డీడ్‌లకు మాత్రమే ఉంది. అయితే ఇపుడు కొత్తగా వీటితో పాటు జీపీఏ, లీజు, వీలునామా ఇతర అన్ని రకాల రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ తప్పనిసరి చేశారు. అంటే ఇక మీదట ఈ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ లేకుండా ఎలాంటి రిజిస్ట్రేషన్ జరగదు. వెబ్‌సైట్ ద్వారా తమకు అనుకూలమైన తేదీ, సమయాన్ని ఎంపిక చేసుకుని స్లాట్ బుక్ చేసుకునే వెసులుబాటు ఉంది. తమకు కేటాయించిన సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ పూర్తి

మిగతా 7వ పేజీలో...



డాటా ఎంట్రీ జాగ్రత్తగా చేయాలి

నేటి నుంచి జిల్లాలోని మేడ్చల్, కుత్బుల్లాపూర్, వల్లభనగర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ తప్పనిసరి. రిజిస్ట్రేషన్ చేసుకునే వారు వెబ్‌సైట్‌లో డాటాఎంట్రీని జాగ్రత్తగా చేయాలి. ఒకటికి రెండు సార్లు చూసుకుని ఎంట్రీ చేయాలి. స్లాట్ బుకింగ్ విధానంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ త్వరగా పూర్తవుతుంది. ఎక్కువ సమయం కార్యాలయాల్లో వేచి చూడాల్సిన అవసరం ఉండదు. పూర్తి లింక్ డాక్యుమెంట్లతో నమోదు చేయాలి.

- అశోక్, మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్



షాపులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కొందుర్గులో విజిబుల్ పోలీసింగ్

చౌదరిగూడ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ డీసీపీ రాజేష్ ఆదేశాల మేరకు కొందుర్గులో పోలీసులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. బుధవారం కొందుర్గు మండల కేంద్రంలో షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి సూచనల మేరకు షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య పోలీస్ బృందంతో పలు దుకాణాల్లో, కిరాణ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో భాగంగా సరైన పత్రాలు లేని 20 బైక్‌లు, 6 ఆటోలను పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. అలాగే గుట్కాలు విక్రయిస్తున్న, బెల్టు షాపులో మద్యం అమ్ముతున్న వ్యక్తి, ఓపెన్ ప్లేస్‌లో మద్యం తాగుతున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. విజిబుల్ పోలీసింగ్‌లో కొందుర్గు ఎస్సై రవీందర్ నాయక్, జిల్లేడ్ చౌదరిగూడ ఏఎస్ఐ సక్రియ, హెచ్‌సీ.శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది నాగేష్, శ్రీధర్‌రెడ్డి, భ్రమరాంబ, చందర్, లావణ్యతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా టీటీడీ సేవలు

తిరుమల ఆలయ ఆస్తుల పరిరక్షణకు కమిటీ

భక్తులకు సౌకర్యాల పెంపు.. టీటీడీ బోర్డు సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం సేవలు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించబోతున్నాయని టీటీడీ పాలక మండల సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి వెల్లడించారు. షాద్‌నగర్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో బుధవారం నిర్వహించిన స్వామి వారి కల్యాణోత్సవానికి హాజరైన నన్నూరి నర్సిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం టీటీడీ సేవలపై తీవ్ర నిర్లక్ష్యం చేసిందని, నూతన పాలక మండలి ఏర్పాటు కాగానే సేవలను విస్తరించడానికి చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రపంచ దేశాలలో వేంకటేశ్వరుడి ఆలయాల నిర్మాణానికి సహకారం అందించాలని విజ్ఞప్తులు వస్తున్నాయని, వాటిని పాలక మండలి పరిశీలిస్తుందని అన్నారు. టీటీడీకి వచ్చే ఆదాయంతో దేశవ్యాప్తంగా ఉన్న ఆలయాల అభివృద్ధి, తిరుమలకు వచ్చే భక్తులకు సౌకర్యాలను పెంచుతూ, హిందూ సంస్కృతిని విస్తరింపజేయాలని పాలక మండలి నిర్ణయించిందని తెలిపారు. అలాగే వేంకటేశ్వరస్వామి ఆస్తుల పరిరక్షణ కోసం కమిటీ వేయాలని పాలక మండలి నిర్ణయించిదని, కమిటీ ఏర్పాటు కాగానే చర్యలు మొదలవుతాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై వారంలో రెండు రోజులు బ్రేక్ దర్శనాలు, మరో రెండు సుపథం దర్శనాలు ఇస్తున్నారని తెలిపారు. షాద్‌నగర్ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని నన్నూరి నర్సిరెడ్డి తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీటీడీ బోర్డు సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి, చిత్రంలో బక్కని నర్సింహులు

వైభవంగా కల్యాణం

షాద్‌నగర్ మున్సిపాలిటీలోని పెద్ద జానంపేట లక్ష్మీవేంకటేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో వేద పండితులు స్వామి వారి కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. టీటీడీ బోర్డు సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి స్వామివారికి వస్త్రాలను అందజేశారు. కార్యక్రమానికి పట్టణ ప్రముఖులు పలబట్ల బాల్‌రాజ్, వెంకటసాయిశ్వర్‌రెడ్డి, ఒగ్గు కిషోర్, కానుగు అంతయ్య, రాజశేఖరరాజు, బి.జగన్ మోహన్‌రెడ్డి, రమేష్‌బాబు, జి.శ్రీనివాస్‌రెడ్డి, కల్వ యాదగిరీష్, గజవాడ నర్సింహులుగుప్త, లింగారం కుమార్‌గౌడ్, కానుగు రాంభూపాల్, రాచమల్ల కృష్ణయ్య పాల్గొన్నారు.

తొట్లలోకి చేరిన నీరు

» స్పందించిన ఎంపీడీవో, ఎంపీవోలు
» యాచారం మండలంలో పర్యటన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యాచారం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): యాచారం మండలంలోని గ్రామాలలో ఏర్పాటు చేసిన తొట్లలో నీరు లేక మూగజీవాలు అలమటిస్తున్నాయని మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'నిరుపయోగంగా నీటితొట్లు' కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలత గ్రామాలలో పర్యటించారు. ధ్వంసమైన నీటి తొట్ల వివరాలు సేకరించి మరమ్మతు చేయిస్తామని వారు చెప్పారు. అయ్యవారిగూడ, నందివనపర్తి, తక్కళ్లపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాలలో నీటి తొట్లను శుభ్రం చేయించి నీటితో నింపించారు. ఈ సందర్భంగా పశువుల దప్పిక తీర్చిన 'ఆంధ్రజ్యోతి'కి అయ్యవారిగూడకు చెందిన రైతులు ధన్యవాదాలు చెప్పారు.



అయ్యవారిగూడలో తొట్టిలో నీరు నింపుతున్న పంచాయతీ సిబ్బంది

పెంచిన గ్యాస్ ధర తగ్గించాలి

» సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

చేవెళ్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలు తక్షణమే తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ ఆధ్వర్యంలో చేవెళ్లలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంచడంతో పేదలపై ఆర్థిక భారం పడుతుందన్నారు. వంటగ్యాస్ ధర పెంచితే నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కేంద్రం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తుందని ఆరోపించారు. పెంచిన ధర తగ్గించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామస్వామి, మండల కార్యదర్శి సత్తిరెడ్డి, నక్క జంగయ్య, శ్రీనివాస్, నాయకులు అంజయ్య, శ్రీకాంత్, పెంటయ్య, యాదగిరి, సుగుణమ్మ, శివ, లలిత, మంజుల పాల్గొన్నారు.



చేవెళ్లలో నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న మోదీ సర్కార్

» జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

మహేశ్వరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ పాలన సాగిస్తున్నారని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ తల పెట్టిన జై బాపు, జై బీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని చిన్నతూప్రా, పెద్దమ్మతండా, మాణిక్యమ్మగూడ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక న్యాయమే ధ్యేయంగా సోనియా, రాహుల్ నేతృత్వంలో కాంగ్రెస్ ముందుకు వెళ్తుందన్నారు. భారత రాజ్యాంగం, అంబేడ్కర్‌పై హోంమంత్రి అమిత్‌షాతో సహా పలువురు బీజేపీ నేతలు అంతర్గతంగా దాడి చేస్తూ దేశాన్ని ముక్కలు చేయాలని చూస్తున్నారని, దీనిని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ అధినాయకత్వం దేశ వ్యాప్తంగా ఓ ఉద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అంబేద్కర్, గాంధీజీని దేశం మరిచిపోయేలా బీజేపీ కుట్రలు చేస్తుందని ఆరోపించారు. అదేవిధంగా రాష్ట్రంలో కులగణన చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు.కార్యక్రమంలో మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్. యాదయ్య, ఐఎన్‌టీయూసీ నియోజకవర్గం అధ్యక్షుడు నడికూడశివ, పార్టీ మాజీ మండలాధ్యక్షుడు ఆవుల యాదయ్య, రాజునాయక్ పాల్గొన్నారు.

ప్రతీ పాఠశాలను అభివృద్ధి చేస్తాం

● ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అమెజాన్ వంటి అనేక సంస్థల సహకారంతో సీఎస్ఆర్ నిధులతో రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. యాచారం మండలంలోని గున్‌గల్ మోడల్ పాఠశాలను అమెజాన్ సంస్థ పునరుద్ధరించింది. విద్యార్థుల కోసం డైనింగ్ హాల్ నిర్మించింది. వాటిని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్షా 74 వేల కోట్లతో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుతో వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందన్నారు. గత ప్రభుత్వం ఫార్మాసిటీ పెట్టి ఈ ప్రాంతాన్ని విషమయంగా మార్చడానికి పూనుకుంటే మేం అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేశామన్నారు. విదేశాల నుంచి విరివిగా సీఎస్ఆర్ నిధులు రాబట్టడానికి సీఎం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 194పాఠశాలలను అభివృద్ధి చేసి వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని అమెజాన్ డైరెక్టర్‌ను కోరారు. బేగరికంచ వద్ద అమెజాన్ సంస్థ ఏర్పాటు అభినందనీయన్నారు. సమావేశంలో డైరెక్టర్ బ్రైన్‌కెల్లార్, ప్రతినిధులు ఓంకార్, ట్రైలర్, తాతాజీ, ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప, ఎంఈవో పాండురంగారెడ్డి, బీఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గున్‌గల్‌లో మోడల్ పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, అమెజాన్ ప్రతినిధులు

ఘనంగా ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకలు

కడ్తాల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుపోవాలని టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. విపక్షాల విష ప్రచారాలను, కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. కడ్తాల మండల కేంద్రంలో బుధవారం ఎన్ఎస్‌యూఐ 55వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక పాల శీతలీకరణ కేంద్రం వద్ద ఎన్ఎస్‌యూఐ నాయకుడు గంట ప్రవీణ్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు షాబోద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్ఎస్‌యూఐ జెండాను ఆవిష్కరించి కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. మండల కేంద్రంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యారంగ సమస్యలతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు ముందుండాలని పిలుపునిచ్చారు. విద్యారంగ అభివృద్ధికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ పాఠశాలల ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జహంగీర్‌అలీ, సత్యం యాదవ్, హీరాసింగ్, క్యామ రాజేశ్, పరుశరామ్, ఇమ్రాన్‌బాబా, బోసు రవి, భానుకిరణ్, శ్రీకాంత్, రమేశ్, రామకృష్ణ, తులసీరామ్, మహేశ్, మల్లేశ్, దర్శన్, పవన్, జశ్వంత్, దినేశ్, ఆసీఫ్, శివ పాల్గొన్నారు.



కడ్తాలలో ఎన్ఎస్‌యూఐ జెండాను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, యాట గీతనర్సింహ

బడుగువర్గాల సంక్షేమమే లక్ష్యం



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో భీంభరత్

షాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బడుగు వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తామని కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. బుధవారం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన 84వ ఏఐసీసీ సమావేశానికి రాష్ట్ర రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావులతో కలిసి పామెన భీంభరత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. అందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రాలు చేపడుతున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణలో పేదలకు సన్నబియ్యం పంపిణీకి సీఎం శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేసిందని ఆరోపించారు. ఇందిరమ్మ రాజ్యంతోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు

నల్లచెర్వుగుట్టను తవ్వేస్తున్నారు

మాడ్గుల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మాడ్గుల మండలంలోని నల్లచెర్వు గ్రామ సమీపంలోని గుట్టను అక్రమార్కులు జేసీబీతో తవ్వి మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. ఆ గుట్టను ఆనుకొని ఉన్న భూమి 30ఏళ్ల క్రితం ప్లాట్లు చేసి ఎస్సీలకు కేటాయించారని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు తెలిపారు. గుట్ట నుంచి జారిన నీరు వృథాగా పోవద్దని తీసిన గుంతల పక్కన ఉన్న మట్టి కట్టలను సైతం అమ్ముకున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.



జేసీబీతో మట్టి తవ్వకాలు

రైతులకు ప్లాట్లు ఇవ్వకుండా పనులేంటి?



సీఐ కృష్ణంరాజుకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

యాచారం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ కోసం భూములు తీసుకున్న రైతులందరికీ ప్లాట్లు కేటాయించకుండా కంచె పనులు చేయడం ఆపాలని, రైతులకు న్యాయం చేయకపోతే ఆందోళన చేస్తామని సీపీఎం యాచారం మండల నాయకులు హెచ్చరించారు. బుధవారం ఈ మేరకు హైదరాబాద్ గ్రీన్‌ఫార్మా సిటీ సీఐ లిక్కి కృష్ణంరాజుకు వినతిపత్రం అందించారు. రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులు పోలీసుల బలగాలతో భూములకు కంచె వేయడం సరైంది కాదన్నారు. 2013చట్టం ప్రకారం రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ రద్దు చేసి రైతులకు భూములు పంపిణీ చేసి ఆదుకుంటామని ఎన్నికల ముందు ఓటర్లకు ఇచ్చిన హామీని నిలుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దంతుక పెద్దయ్య, ఆలంపల్లి జంగయ్య, గడ్డంకుమార్, యాదయ్య, ఎండీ గౌస్, శ్రీకాంత్, లాజర్ తదితరులున్నారు.

మున్సిపల్ కార్మికులను
రెగ్యులరైజ్ చేయాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు

కొత్తూర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మున్సిపల్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో పర్వతాలు హాజరై మాట్లాడారు. ఏళ్లుగా పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉందని, కార్మికులు ప్రమాదాలకు గురైనా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. వారం తపు సెలవులు లేక కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి శేఖర్‌రెడ్డి, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు సంజీ, జంగయ్య, దేవమ్మ, మంజుల, రామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పర్వతాలు

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు

చౌదరిగూడ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుతో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని ఆర్టికల్చర్ అధికారి హిమబిందు అన్నారు. కొందుర్గు రైతు వేదికలో ఉద్యానశాఖ, వాల్యు ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పంటల మార్పిడి విధానాన్ని రైతులు అవలంబించాలన్నారు. ఆయిల్‌పామ్ సాగుతో తక్కువ పెట్టుబడితో ఆధిక లాభాలు ఆర్జించేందుకు ఎక్కువ అవకాశాలుంటాయని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగులో అంతర పంటలుగా పత్తి, మొక్కజొన్న, కూరగాయాలు, చిరుధాన్యాల పంటలు వేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం అందించే రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వాల్యు ఆయిల్ పామ్ డీజీఎం రామోహన్‌రావు, కొందుర్గు ఏవో సురేశ్‌రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ రాకేష్, ఏఈవోలు వాసవి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

జీపీ కార్మికుల వేతనాలు చెల్లించాలి



ఎంపీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చౌదరిగూడ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహారెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుద్దుల జంగయ్య అన్నారు. బుధవారం కొందుర్గు పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీవో విజయ్‌కుమార్‌పాల్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ జీపీలో కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాదబీమా వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, జంగయ్య, లింగం, కృష్ణ, రాములు, జంగయ్య, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సన్‌వల్లి ప్రభాకర్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. షాద్‌నగర్ ఏబీ కాంప్లెక్స్‌లో బుధవారం పార్టీ ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు పిట్టల సురేశ్ అధ్యక్షతన జరిగిన మండల కార్యకర్తల సమావేశానికి ప్రభాకర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. వచ్చే సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బూత్ కమిటీలను, శక్తి కేంద్ర కమిటీలను వేయాలన్నారు. సమావేశంలో నాయకులు కక్కునూరి వెంకటేష్‌గుప్త, దొడల వెంకటేష్‌యాదవ్, ఎంకనోళ్ల వెంకటేష్, నర్సింహులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

నాలుగు లేన్ల రోడ్డు పనులు ప్రారంభం

బషీరాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ ఆర్అండ్‌బీ మార్గంలో నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. కాంట్రాక్టర్ యంత్రాలతో అగ్గనూర్-ఎన్కెపల్లిగేటు మధ్య రోడ్డుకు ఇరువైపులా చదను చేస్తున్నారు. బషీరాబాద్-లక్ష్మీనారాయణపూర్ రోడ్డును నాలుగు లేన్లుగా మార్చేందుకు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి రూ.106కోట్లతో శంకుస్థాపన చేశారు. యాలాలమండల లక్ష్మీనారాయణపూర్ వద్ద నుంచి వెళ్తున్న నూతన జాతీయ రహదారిని అనుసంధానిస్తూ రూ.68లక్షలతో బషీరాబాద్ వరకు గల 18కిలోమీటర్ల రోడ్డును నిర్మిస్తున్నారు. బషీరాబాద్ నుంచి మైల్వార్ వరకు 11కిలోమీటర్ల సింగిల్ రోడ్డును రూ.38లక్షలతో డబుల్ రోడ్డుగా మారుస్తున్నామని ఆర్అండ్‌బీ ఏఈ రిషి తెలిపారు.

జైల్‌భరోను అడ్డుకున్న పోలీసులు

పరిగి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జైలుభరో ఆందోళన్‌లో పాల్గొనకుండా బీఎంపీ కార్యకర్తలను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. బీఎంబీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్, రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్‌లను స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గట్యానాయక్, గోవింద్‌లు మాట్లాడుతూ.. దేశంలో కుల గణన చేపట్టాలని, బీసీలకు 52శాతం రిజర్వేషనిచ్చి, మండల్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎంపీ నాయకులు రవీందర్, రవి, బుచ్చిలింగం, కొర్ర బాలకృష్ణ, వినోద్, గణేశ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ రాజేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్, గ్రామస్తులు

గ్రామంలో సౌకర్యాలు కల్పించాలి

శామీర్‌పేట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో సరైన సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నామని పొన్నాల్ గ్రామస్తులు ఎంపీ ఈటల రాజేందర్‌తో వాపోయారు. బుధవారం బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల బీజేపీ అధ్యక్షుడు కొర్వి క్రిష్ణ, నాయకులు పొన్నాల్ గ్రామస్తులు ఎంపీని తన నివాసంలో కలిశారు. గ్రామంలో సరైన రోడ్లు, విద్యుత్‌లైట్లు, డ్రైనేజీ వ్యవస్థ లేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. గ్రామ సమ్యలను తీర్చేందుకు నిధులు మంజూరు చేయాలని ఎంపీకి వినతిపత్రం ఇచ్చారు. అలాగే వినియోగదారులకు, భక్తులకు నాణ్యమైన పూజా సామాన్లను విక్రయించి వారి మన్ననలను పొందాలని ఎంపీ రాజేందర్ అన్నారు. అలియాబాద్‌లో శ్రీరాజరాజేశ్వరి పూజాసామగ్రి, గిఫ్ట్ స్టోర్‌ను ఆయన ప్రారంభించారు.

పోలీసులకు సవాల్‌గా ఇప్పాయిపల్లి ఘటన

కులకచర్ల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పాయిపల్లి సంఘటన పోలీసులకు సవాల్‌గా మారింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలు నర్సమ్మ మెడలోని బంగారు పుస్తెలతాడును దుండగులు తెంపుకెళ్లారు. ఈ క్రమంలో వృద్ధురాలికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మూడు రోజుల క్రితం జరిగింది. పోలీసులు గ్రామానికి చెందిన కొందరిని విచారించగా ఫలితం లేకపోయింది. నర్సమ్మ హైదరాబాద్‌లోని ఓఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె కుటుంబీకుల అనుమానం మేరకు గ్రామానికి చెందిన ఓవ్యక్తిని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

గర్భంలో శిశువు మృతి..

» ప్రైవేట్ స్కానింగ్‌కు రెఫర్ చేసిన ప్రభుత్వ వైద్యులు

తాండూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తాండూరులోని మాతాశిశు ఆస్పత్రిలో ప్రసూతి కోసం వచ్చిన గర్భిణి గర్భంలోనే శిశువు మృతి చెందడంతో కుటుంబీకులు ఆందోళన చెందారు. గౌతాపూర్‌నకు చెందిన ఆశమ్మ డెలివరీ కోసం బుధవారం ఆరోగ్య కేంద్రానికి వచ్చింది. స్కానింగ్ చేసే రేడియాలజిస్ట్ 10గంటల తర్వాతే వస్తారని సిబ్బంది చెప్పారు. ఆశమ్మను ప్రైవేటులో స్కానింగ్ చేయించుకోవాలని సూచించారు. దీంతో ప్రైవేట్‌గా స్కానింగ్ చేయించుకున్నారు. రిపోర్టులో శిశువు మృతిచెందిందని నిర్ధారించారు. తాము వెళ్లిన వెంటనే మాతాశిశు ఆస్పత్రి వైద్యులు ఆపరేషన్ చేసి ఉంటే శిశువు బతికేదని గర్భిణి కుటుంబీకులు ఆరోపించారు. కాగా రేడియాలజిస్ట్ ఒక్కరే ఉండటంతో ఉదయం 10తర్వాతనే స్కానింగ్ సేవలు అందుబాటులోకొస్తాయని వైద్యులు తెలిపారు. గర్భిణిని పరీక్షించి శిశువు మృతిచెందినట్లు అనుమానం రావడంతోనే ప్రైవేట్ స్కానింగ్‌కు రిఫర్ చేశామని ఆర్ఎంవో అనిల్ తెలిపారు.

శోభాయాత్రను ప్రశాంతంగా జరుపుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): హనుమాన్ శోభాయాత్రను ప్రశాంతంగా జరుపుకోవాలని ఘట్‌కేసర్ సీఐ పి.పరశురాం తెలిపారు.పోలీసుస్టేషన్‌లో బుధవారం శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఈనెల 12న జరుగనున్న హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా ర్యాలీలు శాంతియుతంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ నర్సింహ, నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు

ఆమనగల్లు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ చంద్రాయన్‌పల్లి తండాలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు చెక్కాల లక్ష్మణ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బూత్ కమిటీ అధ్యక్షుడు కేతావత్ రాములు నాయక్ బీజేపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్, గోపాల్ నాయక్, లక్ష్మణ్, తదితరులు ఉన్నారు. అలాగే ఆమనగల్లు మండలం చింతలపల్లి, గౌరారం, ఆకుతోటపల్లి, శెట్టిపల్లి, సీతారామ్ నగర్ తండాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు ఎర్రవోలు శ్రీను ఆధ్వర్యంలో బీజేపీ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు గోరటి నర్సింహ, లక్ష్మణ్‌రావు, శేఖర్ రెడ్డి, యాదయ్య, అంజయ్య పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



కడ్తాల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బాలాజీనగర్ తండా సమీపంలోని ధనరాశి పర్వతం పైగల శ్రీరాధాకృష్ణ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ముగిశాయి. మూడు రోజులపాటు బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగాయి. ఆలయ ధర్మకర్త రామావత్ బీచ్యానాయక్ బాపోజీ, ఆధ్వర్యంలో భక్తులకు వసతులు కల్పించారు. ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కమ్లీబీచ్యానాయక్, ఆలయ సభ్యుడు డాక్టర్ రాంచందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ- హిసార్‌ల మధ్య సమ్మర్‌స్పెషల్ రైళ్లు

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో పెరిగిన ప్రయాణికుల రద్దీని పురస్కరించుకుని కాచిగూడ- హిసార్‌ల మధ్య 22 ప్రత్యేక సమ్మర్ రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలియజేశారు. ఏప్రిల్ 17 నుంచి జూన్ 26 (గురువారం) వరకు కాచిగూడ నుంచి హిసార్‌కు (07717)కు 11 రైళ్లు, ఏప్రిల్ 20నుంచి జూన్ 29 వరకు హిసార్ నుంచి కాచిగూడ (07718)కు 11 రైళ్లు నడుపుతున్నట్టు రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఈ రైళ్లు వెళ్లి వచ్చేప్పుడు మల్కాజ్‌గిరి, మేడ్చల్, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మాబాద్, ముద్ఖేడ్, నాందేడ్, పూర్ణ, బస్మత్, హింగోళీ, వాషిమ్, అకోలా, షెగాన్, మల్కాపూర్, భుసవల్, జాల్గాన్, నందుర్‌బార్, ఉద్నా, వడోదర, గోద్రా, రట్లం, మండ్సోర్, నీమక్, చిత్తగర్హ, బిల్వారా, బిజయ్‌నగర్, నసిరాబాద్, అజ్మీర్, కిషన్‌ఘర్, ఫులేరా, రింగస్, నవల్‌ఘర్, ఝుంజును, చిరవ, లాహరో, సాదుల్‌పూర్ స్టేషన్‌లో ఆగుతాయని వివరించారు.

సన్న బియ్యం.. సంబురం

(ఐదో పేజీ తరువాయి)

కాక ముందే రికార్డు స్థాయిలో పంపిణీ జరిగింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 13.75 లక్షల ఆహార భద్రత కార్డులున్నాయి. కార్డుదారులకు ప్రతీ నెలా దాదాపు 30వేల టన్నుల బియ్యం సరఫరా చేసే వారు. ఇందులో 20 నుంచి 22వేల వేల టన్నుల బియ్యం మాత్రమే పంపిణీ జరిగేది. వీటిని కూడా వీలున్నపుడే కార్డుదారులు తీసుకునేవారు. గతంలో ప్రతీ నెలా 15వ తేదీ నాటికి కనీసం 50 శాతం కూడా అమ్మకాలు జరిగేవి కావు. అయితే ఈ నెల ఇప్పటికే 70 శాతానికిపైగా రేషన్ బియ్యం పంపిణీ జరిగింది.

13వేల మెట్రిక్ టన్నులకుపైగా

రంగారెడ్డి జిల్లాలో అయితే గతంలో ఎప్పుడూ లేని విధంగా సగటు కోటాకు మించి బియ్యం అమ్మకాలు జరిగాయి. ప్రతి నెలా రేషన్ దుకాణాలకు 14,500 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేయాల్సి ఉండగా అమ్మకాలను దృష్టిలో పెట్టుకుని 11,587 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే సరఫరా చేసే వారు. అయితే ఈనెల 9వ తేదీ నాటికే 13 వేల మెట్రిక్ టన్నులకుపైగా పంపిణీ చేశామని అధికారులు తెలిపారు. అంటే దాదాపు 90 శాతం పంపిణీ పూర్తయింది. ఇంతకు ముందెన్నడూ ఈ స్థాయిలో రేషన్ బియ్యం పంపిణీ జరిగిన దాఖలాలు లేవు. మరో వారం రోజుల నాటికి దాదాపు రేషన్ పంపిణీ పక్రియ పూర్తికావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈలోగానే మిగతా మొత్తం బియ్యాన్ని రేషన్ షాపులకు పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు.

95శాతానికి దాటి పంపిణీ

ఇటీవల జిల్లాలో కొత్తగా 23 వేల రేషన్‌కార్డులు జారీ చేయడంతో కార్డుదారుల సంఖ్య 5.81 లక్షలకు చేరింది. దీంతో గతంలో కంటే అదనంగా మరో 500 టన్నులకుపైగా బియ్యం సరఫరా చేయాల్సి ఉంటుంది. దీంతో ఈ నెలలో 95 శాతానికి దాటి రేషన్ బియ్యం పంపిణీ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక మేడ్చల్ జిల్లాలో ఇప్పటి వరకు 65 శాతం, వికారాబాద్ జిల్లాలో 60 శాతం వరకు కార్డుదారులు బియ్యాన్ని తీసుకెళ్లారు.

దొడ్డుబియ్యం బాధ తప్పింది



గతంలో ఇచ్చే దొడ్డు బియ్యం ఇతరులకు ఇచ్చి సన్న బియ్యం కొనే వాళ్లం. సన్న బియ్యం పంపిణీతో ప్రస్తుతం ఆ బాధ తప్పింది. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ సన్న బియ్యం తీసుకుకొ వండుకుని తింటున్నారు.

-ఎస్.లక్ష్మి, అత్వేల్లి గ్రామం

ఇక చకచకా..!

(ఐదో పేజీ తరువాయి)

చేసుకుని తక్కువ సమయంలోనే తిరిగి వెళ్లిపోవచ్చు. రోజుకు 40కిపైగా రిజిస్ట్రేషన్లు జరిగే కేంద్రాలనే ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఎంపిక చేశారు.

దశలవారీగా మిగతా చోట్ల..



ఈ కొత్త విధానంలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తీర్చిదిద్దుతున్నామని ప్రభుత్వం తెలిపింది. ఎంపిక చేసిన ఆరు ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ ప్రక్రియ విజయవంతమైతే దశలవారీగా మిగతా చోట్ల కూడా ఈ విధానాన్ని అమల్లోకి తీసుకువస్తారు. రిజిస్ట్రేషన్ చేసుకునే వారు స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లోని సిటిజన్ లాగిన్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. స్లాట్ బుకింగ్ సమయంలో ఆస్తులు అమ్మేవారు, కొనేవారి వివరాలతో పాటు రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన పూర్తివివరాలు నమోదు చేయాలి. అలాగే సదరు ఆస్తులకు సంబంధించిన అన్ని లింక్ డాక్యుమెంట్ల సమాచారం అప్‌లోడ్ చేయాలి. ఇవన్నీ నమోదు చేశాక రిజిస్ట్రేషన్ ఫీజు ఎంత చెల్లించాలి? అనేది వెబ్‌సైట్‌లో ఆటోమెటిక్‌గా జనరేట్ అవుతుంది. వీటికి సంబంధించిన ఫీజులు నెట్ బ్యాంకింగ్ లేదా యూపీఐ పేమెంట్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది.

వేగవంతంగా...

కొత్త విధానంలో రిజిస్ట్రేషన్లు సులభతరంగా వేగవంతంగా జరుగుతాయి. ఒక్కో డాక్యుమెంట్‌కు కేవలం 10 నుంచి 15 నిమిషాల సమయం మాత్రమే పడుతుంది. ఒక విధంగా చెప్పాలంటే వ్యవసాయ భూములకు సంబంధించి ఇపుడు ధరణి విధానంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ మాదిరిగానే స్లాట్ బుక్ చేసుకుని వేగవంతంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సేల్ డీడ్, గిఫ్ట్‌డీడ్, మార్టిగేజ్ డీడ్, జీపీఏ, లీజు, వీలునామాతో పాటు రిజిస్ట్రేషన్లకు ముందుగా వెబ్‌సైట్‌లోకి వెళ్లి స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. రోజులో రెండు విడతలుగా స్లాట్లు బుక్‌చేసుకునే అవకాశం ఉంది. ఈ కేంద్రాల్లో అదనంగా మరో సబ్ రిజిస్ట్రార్‌ను నియమిస్తున్నందున ఎక్కువ సంఖ్యలో స్లాట్లు అందుబాటులో ఉంచారు. ఒక్కో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు కనీసం 96 రిజిస్ట్రేషన్లు జరిగే విధంగా ఏర్పాట్లు చేశారు. ఉదయం 10:30 గంట నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు 48 స్లాట్లు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు 48చొప్పున స్లాట్లు కేటాయించారు. అంటే ఒక్కో సబ్ రిజిస్ట్రార్‌కు గరిష్ఠంగా 48స్లాట్లు వరకు రిజిస్ట్రేషన్ చేస్తారు. గతంలో రోజూ ఒక్కో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 36 స్లాట్లు మాత్రమే అందుబాటులో ఉంచగా, నూతన విధానంలో 48కి పెంచారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు ఉంటారు. కనుక స్లాట్ బుకింగ్ రెట్టింపు అంటే 96 అవుతాయి. అయితే స్లాట్ బుక్ చేసుకోలేని వారి కోసం అత్యవసర రిజిస్ట్రేషన్లు చేసుకునే వెసులుబాటు కూడా ఇచ్చారు. ఇలాంటి వారి కోసం రోజూ సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ప్రత్యేకంగా వాక్ ఇన్ రిజిస్ట్రేషన్లకు అనుమతిస్తారు. వాక్ ఇన్ రిజిస్ట్రేషన్లు రోజుకు కేవలం అయిదు మాత్రమే చేసుకునే అవకాశం ఉంది. నేరుగా కార్యాలయానికి వచ్చిన వారికి ఫస్టకమ్ ఫస్ట్ సర్వ్ పద్ధతిలో ఈ రిజిస్ట్రేషన్ చేస్తారు.

ఇక్కడ నుంచే శ్రీకారం

స్లాట్ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రయోగాత్మకంగా 22కేంద్రాల్లో అమలు చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్, సరూర్‌నగర్, చంపాపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు మేడ్చల్ జిల్లాలోని కుత్బుల్లాపూర్, వల్లభ్‌నగర్, మేడ్చల్‌లో నేటి నుంచి కొత్త విధానం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. ఇక ఈ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ లేకుండా రిజిస్ట్రేషన్‌కు వచ్చేవారిని అనుమతించరు. రిజిస్ట్రేషన్లు వేగవంతంగా చేసేందుకు ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కనీసం ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరిగే కుత్బుల్లాపూర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అదనంగా మరో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లను నియమించారు. దీంతో ఈ కార్యాలయంలో 144 స్లాట్లు అందుబాటులోకి రానున్నాయి.

అందరి సహకారంతో అభివృద్ధి

» ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిధులే గాకుండా పలు కంపెనీల సీఎస్ఆర్ నిధులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని తులేకలాన్ గ్రామంలో అమేజాన్ కంపెనీ సహకారంతో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించతలపెట్టిన గ్రంథాలయ భవనానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు, మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. వేసవిలో నీటి ఎద్దటి లేకుండా మిషన్ భగీరథ అధికారులతో ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నామన్నారు. గ్రామంలో హెల్త్ సెంటర్ కోసం స్థలాన్ని ఇవ్వడానికి దాతలు ముందుకొస్తున్నారని పేర్కొన్నారు. యువజన సంఘాల కోరిక మేరకు ప్రభుత్వ పాఠశాలలో శిథిలమైన పాఠశాల గదుల స్థానంలో త్వరలోనే నూతన గదుల నిర్మాణం చేనట్టనున్నట్లు అమేజాన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ రాణి, ఎంపీడీవో వెంకటమ్మ, అమేజాన్ ప్రతినిధులు పార్థసారథి, సురేష్, నాయకులు సత్తు శశాంక్‌రెడ్డి, బత్తుల రాంరెడ్డి, కోడూరి రమేష్, దోమ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీలో చేతివాటం

» బియ్యం బస్తాల్లో తరుగు

» లబోదిబోమంటున్న డీలర్లు

» ఒక్కో బస్తా 8కిలోల తరుగు

మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి ప్రతినిధి):ఆహార భద్రత కార్డుదారులకు పంపిణీ చేసే బియ్యం సరఫరాలో గోదాంల వద్దే చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి సంచులు రేషన్ దుకాణాలకు వస్తాయి. కొన్నింట్లో కిలోల కొద్దీ బియ్యం తక్కువగా వస్తుండటంతో డీలర్లు లబోదిబోమంటున్నారు. మేడ్చల్ డివిజన్‌లో ఓ ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి వచ్చే సంచుల్లో పెద్ద ఎత్తున తరుగు వస్తోంది. ఎంఎల్ఎస్ పాయింట్లకు దూరంగా ఉండే దుకాణాలకు వెళ్లే సంచుల్లోనూ బియ్యం తక్కువ వస్తోంది. ఈ నెల నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారు. లబ్ధిదారులంతా బియ్యం తీసుకునేందుకు వస్తున్నారు. బస్తాల్లో కిలోల చొప్పున తరుగు వస్తుండటంతో ఎలాభర్తీ చేయాలని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్ల వద్దే..!

జిల్లాలో 619రేషన్ దుకాణాలున్నాయి. వీటికి ఆరు ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి నెలనెలా కోటా సరఫరా చేస్తారు. గన్నీ సంచి బరువు 500గ్రాములు, బియ్యం బరువు 50కిలోలు కలిపి మొత్తం 50.5కిలోల తూకం వేసి దుకాణాలకు పంపిస్తారు. కొన్ని ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి వచ్చే సంచులు 42.51 కిలోలే ఉంటున్నాయి. మరి కొన్ని దుకాణాలకు మరింత తక్కువ వస్తున్నట్లు డీలర్లు చెబుతున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఒకేసారి క్వింటాళ్ల చొప్పున తూకం వేయడంతో సంచుల్లో కోత వస్తున్న విషయం తెలియడం లేదు. ప్రతి నెలా కొన్ని దుకాణాల్లో ఈ సమస్య తలెత్తుతోందని డీలర్లు పేర్కొంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక సరఫరా అస్తవ్యస్తంగా మారిందనే ఆరోపణలున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డీలర్లు కోరుతున్నారు.



50కిలోల సంచి తూకం వేస్తే చూపుతున్న 42.51 కిలోలు

పరిహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తాండూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం హకీంపేట, లగచర్లకు సంబంధించి పట్టా భూముల రైతులకు తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ బుధవారం పరిహార చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక పార్కులో భూములు కోల్పోయే రైతులకు ఒకే దఫాలో పరిహారం అందజేస్తామని తెలిపారు. భూములు కోల్పోయే వారందరికీ ఎకరాకు 150గజాల చొప్పున ఇంటిస్థలం, అర్హత మేరకు ఇంటికో ఉద్యోగం, ఇందిరమ్మ ఇళ్లను ఇస్తామని చెప్పారు. ఎకరం లోపు ఉన్న వారికి 75గజాల ఇంటి స్థలాన్ని కేటాయిస్తామన్నారు. రైతులు ప్రభుత్వం అందజేసిన పరిహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హకీంపేట, లగచర్లల్లో 30మంది రైతులు 29ఎకరాల 22గుంటల భూమిని పారిశ్రామిక పార్కుకు భూములను కేటాయిస్తున్నట్లు తెలిపారు. భూములు ఇచ్చిన రైతులకు పరిహారం కింద రూ. 5.91కోట్ల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, తహసీల్దార్ కిషన్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను అడ్డుకుంటే ఊరుకోం

పరిగి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పరిగి పరిధి తుంకులగడ్డలో పేదల ఇళ్ల నిర్మాణాలను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య మాట్లాడుతూ.. ఏళ్లుగా ఆ స్థలంలో ఉన్న వారి ఇళ్ల నిర్మాణాలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇంటి నంబరు లేదని విద్యుత్ అధికారులు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం లేదన్నారు. ఏడాదికాలంలో పేదలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు వెంటనే ఇంటి నంబర్లు ఇవ్వాలని వినతిపత్రం ఇచ్చారు. నాయకులు హబీబ్, శ్రీరాములు, శేఖర్,శంషాద్, వెంకటయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారుజ

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బషీరాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్ అన్నారు. ఏప్రిల్ 19నుంచి సమ్మెకు దిగుతామని బుధవారం పంచాయతీ కార్మికులతో కలిసి ఎంపీడీవో విజయ్‌కుమార్‌కు నోటీసు ఇచ్చారు. ఆయన మట్లాడుతూ.. ప్రభుత్వం కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మాణెప్ప, సురేశ్, కార్మికులు శ్యామప్ప, చందు, నరేష్ లక్ష్మి, భీమమ్మ, చంద్రప్ప పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ బ్రహ్మోత్సవాలు

కడ్తాల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ విజయ గణపతి, జ్ఞాన సరస్వతి, శ్రీదేవి భూదేవీసమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి, సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఆలయాల తృతీయ వార్షికోత్సవ వేడుకలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు సాగే వేడుకల నేపథ్యంలో ఆలయాలను పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రాక నేపథ్యంలో ఆలయ ధర్మకర్త పోకల బస్వరాజ్ రాజమణి దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా తొలి రోజు సుప్రభాత సేవతో స్వామి వార్లకు మేలుకొలుపు పాడారు. అనంతరం దేవతా మూర్తుల మూల విగ్రహాలను పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకం, గోపూజ, మహాగణపతి, విశ్వక్‌సేన ఆరాదన, పుణ్య హవాచనం, అఖండ దీపారాధన నిర్వహించారు. పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శుక్రవారం నిర్వహించే సీతారాముల కల్యాణానికి పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సాయిరెడ్డి, మల్లికార్జున్, దిలీప్‌కుమార్, నాగార్జున్, యాదగిరిరెడ్డి, రామకృష్ణ, సంతోష్, వినయ్‌కుమార్, సాయికుమార్ పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

సమస్యలపై ఫోన్‌చేస్తే స్పందించండి

తాండూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తాండూరులో నెలకొన్న సమస్యలపై ఫోన్ చేస్తే అధికారులు ఫోనే ఎత్తడం లేదని మాజీ కౌన్సిలర్లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి చెప్పారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ.. ఏమైనా సమస్యుంటేనే ప్రజలు ఫోన్ చేస్తారని, ఊరికే కాల్స్ చేయరన్నారు. ఫోన్లు ఉన్నది ఎందుకని, ప్రజలే నేరుగా సమస్యలు వివరిస్తోంటే అధికారులు ఎందుకు స్పందించడం లేదని అధికారులను ప్రశ్నించారు. తాండూరు మున్సిపల్ కార్యాలయంలో బుధవారం 36వార్డుల అధికారులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమస్యలపై అధికారులు నోట్‌చేసుకొని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. బల్దియాలో స్పెషల్ సెల్ ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి పైపులైన్ల ఏర్పాటుకు రూ.45కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. చెత్త సేకరణ, తాగు నీరు, విద్యుత్ సరఫరాపై ఇబ్బందుల్లేకుండా చూడాలని, పాత పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పర్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. వార్డు ఆఫీసులను ప్రారంభించేలా కృషి చేస్తానన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వార్డు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సబ్ కోర్టు ఏర్పాటుకు కృషిచేస్తా

తాండూరు బార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను న్యాయవాదులు సన్మానించారు. మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాండూరులో సబ్ కోర్టు ఏర్పాటుకు కృషిచేస్తానని తెలిపారు. బార్ అసోసియేషన్ చైర్మన్ శ్రీనివాస్, సెక్రటరీ చంద్రశేఖర్, న్యాయవాదులు శ్రీనివాస్ రెడ్డి, రాంరెడ్డి, మనోహర్‌రావు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని 169మంది లబ్ధిదారులకు రూ.70.2లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే క్యాంప్ పంపిణీ చేశారు.

భద్రేశ్వరుడి జాతరకు ఏర్పాట్లు చేయాలి

భద్రేశ్వర ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని అధికారులను, ఆలయ కమిటీని ఎమ్మెల్యే ఆదేశించారు. తాండూరులోని భద్రేశ్వర ఆలయ ఆవరణలో అన్నపూర్ణ మాతా దాసోహం భవనాన్ని ప్రారంభించి శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. భవన నిర్మాణంలో భాగస్వాములైన కమిటీ సభ్యులు, వీరశైవ సమాజ ప్రతినిధులను అభినందించారు. దాసోహం భవనంతో నిత్యా అన్నదాన కార్యక్రమం ద్వారా ఎంతో మందికి మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ పటేల్ కిరణ్, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, వీరశైవ సమాజ ప్రతినిధులు శ్రీశైలం, బస్వరాజ్, ఆలయ ఈవో శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

రైతులు ఆరోగ్యంగా ఉంటేనే దేశం బాగుంటుంది



ఈ-క్లినిక్‌ను ప్రారంభించిన చిగుళ్లపల్లి రమేశ్

వికారాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): దేశానికి అన్నం పెట్టే రైతులు ఆరోగ్యంగా ఉంటేనే దేశ ప్రజలంతా బాగుంటారని వికారాబాద్ మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ చిగుళ్లపల్లి రమేశ్‌కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్‌లోని బసంత్ ఫంక్షన్‌హాల్ ఎదురుగా ఎం స్వాస్త్, మన గ్రోమార్‌లు ఏర్పాటు చేసిన ఈ-క్లినిక్‌ను కోరమండల్ వైస్‌ప్రెసిడెంట్ జి.బాబు, ఎం స్వాస్త్ ఎండీ నీరజ్‌లతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ-క్లినిక్‌లో రైతులు ఏడాది పాలసీ తీసుకుంటే ఆన్‌లైన్‌లో డాక్టర్లతో సంప్రదించి క్లినిక్‌లో ఉచితంగా చికిత్స పొందొచ్చని, టెస్టులు, మందులు కూడా ఉచితంగా ఇస్తారని తెలిపారు. జిల్లాలోని ప్రతీ రైతు ఈ-క్లినిక్ పాలసీ తీసుకోవాలని సూచించారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మొదటి సారి ఈ-క్లినిక్‌ను వికారాబాద్‌లోనే ప్రారంభించామని, భవిష్యత్తులో మన గ్రోమోర్ సెంటర్లు ఉన్నచోటల్లా ఈ-క్లినిక్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థల నిర్వాహకులు, డాక్టర్లు, నర్సులు పాల్గొన్నారు.


జానకీరామ్‌రెడ్డి


చందా గంగాధర్

నూతన సీఐల రాక

ఆమనగల్లు సీఐగా జానకీరామ్‌రెడ్డి
కడ్తాల్ సీఐగా చందా గంగాధర్

ఆమనగల్లు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జానకీరామ్‌రెడ్డి నియమితులయ్యారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి నుంచి బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ పని చేస్తున్న ప్రమోద్‌కుమార్‌ను ఆర్‌జీఐ ఎయిర్‌పోర్టు ట్రాఫిక్ సీఐగా బదిలీ చేశారు. ఏసీబీలో పని చేస్తున్న జానకీరామ్‌రెడ్డికి ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారు. 13 నెలలపాటు ప్రమోద్‌కుమార్ అంకిత భావంతో విధులు నిర్వహించి స్థానికంగా ప్రజల అభిమానం పొందారు. కడ్తాల్ సీఐగా చందా గంగాధర్ నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న శివప్రసాద్‌ను సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో శామీర్‌పేట్‌లో డీఐగా పని చేస్తున్న గంగాధర్‌కు కడ్తాల సీఐగా పోస్టింగ్ ఇచ్చారు.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

ఆమనగల్లు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ఆమనగల్లు పట్టణంలోని కల్యాణి గార్డెన్‌లో ఏర్పాటు చేసినట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, బీచ్యనాయక్, ప్రభాకర్‌రెడ్డి, కిషన్ రెడ్డి తెలిపారు. జైబాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వాహణ గూర్చి సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల, నియోజకవర్గ ఇన్‌చార్జి జైపాల్, పార్టీ ముఖ్య నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు.

పేదింటి పెళ్లికి చేయూత

కడ్తాల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మైసిగండికి చెందిన రామావత్ చెన్ననాయక్ హీరా దంపతుల కూతురు జయంతి వివాహానికి బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు రాందాస్‌నాయక్ చేయూతనందించారు. బుధవారం జయంతి వివాహం సందర్భగా రూ.10 వేలు అందజేశారు. మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, నాయకులు బుజ్జనాయక్, రాజునాయక్, పంత్యానాయక్, వినోద్, అంజి, శ్రీను నాయక్ ఉన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



కడ్తాల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పోషకాలతో కూడిన ఆహారం సంపూర్ణ ఆరోగ్యానికి దోహద పడుతుందని ఆమనగల్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి అన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, కిశోర బాలికలు సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. కడ్తాల మండలం మక్తమాదారం గ్రామంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోషక పదార్థాలను ప్రదర్శించారు. తల్లిపాల విశిష్టత, పోషక విలువల గురించి స్థానికులకు అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, ఆయా శారద, ఆశా కార్యకర్త అనిత పాల్గొన్నారు.

ప్రహరీ లేక పరేషాన్!

- ప్రధాన రోడ్డుకు ఆనుకొని
- కేశంపేట ప్రాథమిక పాఠశాల
- కాంపౌండ్ వాల్ లేక ఇబ్బందులు
- వేగంగా వెళ్తున్న వాహనాలు
- ఆడుతూ రోడ్డు వైపు వెళ్తున్న పిల్లలు
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు


పాఠశాల ముందు ఆడుకుంటున్న విద్యార్థులు

కేశంపేట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కేశంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రక్షణ కరువైంది. బడికి ప్రహరీ లేక పిల్లలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాల ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉంటుంది. దీంతో ఆ దారివెంట వాహనాలు స్పీడ్‌గా దూసుకొస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక భయంభయంగా విద్యార్థులు గడపాల్సి వస్తుంది. ఈ విషయంలో పిల్లల తల్లిదండ్రులు కూడా భయాందోళనకు గురవుతున్నారు. కాంపౌండ్ వాల్, కిచెన్ షెడ్, టాయిలెట్లు లేక విద్యార్థులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

కేశంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు బోధన సాగుతుంది. పాఠశాలలో ప్రస్తుతం 100 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. 'మన ఊరు మన బడి'లో భాగంగా ఇటీవల పాఠశాలకు నూతన భవనం నిర్మించారు. అయితే బడిలో కిచెన్ షెడ్, కాంపౌండ్ వాల్, టాయిలెట్లు నిర్మించడానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద దాదాపు రూ. 26లక్షలు మంజూరైనాయి. పనులు చేయడానికి అప్పటి గ్రామ సర్పంచ్ తలసాని వెంకట్ రెడ్డి ముందుకు వచ్చారు. కిచెన్ షెడ్ నిర్మాణానికి పిల్లర్లు వేయడానికి సీకులు వేశాడు. అయితే మన ఊరు మన బడిలో కట్టించిన పాఠశాలలకు బిల్లులు రాకపోవడంతో ప్రహరీ, కిచెన్ షెడ్, టాయిలెట్ల నిర్మాణ పనులు చేయకుండా వదిలేశాడు. అప్పటి నుంచి పాఠశాలలో పనులు చేయడానికి ఎవరూ ముందుకు రావడంలేదు. దీంతో పనులు నిలిచి పోయాయి.

కాంపాడ్ వాల్ లేక ఇబ్బందులు

పాఠశాలకు నరేగాలో నిధులు మంజూరైన పనులు చేయడానికి ముందుకు రాకపోవడంతో కాంపౌండ్, కిచెన్ షెడ్, టాయిలెట్లు పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారి పోయాయి. బడికి ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు ఆడుకుంటూ రోడ్డుపైకి వెళ్తున్నారు. రోడ్డుపై ఎప్పుడు ఎక్కడి నుంచి ఏ వాహనం వస్తుందో తెలియని పరిస్థితి ఉంది. వాహన చోదకులు గమనించకుండా వెళితే చిన్నారులకు ప్రమాదం జరిగే ఆవకాశం లేకపోలేదు. కాంపౌండ్ లేక విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులూ ఇబ్బందులకు గురవుతున్నారు.

కేశంపేట- కాకునూర్ రోడ్డులో వాహనాల రద్దీ

కేశంపేట- కాకునూర్ ప్రధాన రోడ్డు పక్కనే కేశంపేట ప్రాథమిక పాఠశాల ఉంది. ఇటీవల ఈ రోడ్డు డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేశారు. దీంతో వాహనాల రద్దీ పెరిగింది. కార్లు, బస్సులు, లారీలు, మోటార్ సైకిళ్ల ఈ మార్గంలో వేలాదిగా వెళ్తున్నాయి. రోడ్డుకు అతీ సమీపంలో పాఠశాల ఉండడం. విద్యార్థులు ఆడుతూ రోడ్డు పైకి వస్తే ప్రమాదం జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రమాదం జరిగే వరకు వేచిచూడక అధికారులు చొరవ తీసుకుని పాఠశాలకు కాంపౌండ్, కిచెన్ షెడ్, టాయిలెట్లు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

స్కూల్ ముందు నుంచే వాహనాలు



మా స్కూల్ ముందు నుంచి కార్లు, బస్సులు చాలా పోతాయి. మేము ఆడుకుంటున్నప్పుడు కూడ సైకిల్ మోటర్లు పోతున్నాయి. కొందరు రయ్యిన బండ్లు నడుపుతున్నారు. మా స్కూల్‌కి గోడ కట్టించాలి.

- సృజన, 5వ తరగతి, విద్యార్థిని, కేశంపేట

ప్రమాదపుటంచున విద్యార్థులు



కేశంపేట- కాకునూర్ రోడ్డు బాగు చేసిన తరువాత వాహనాలను స్పీడ్‌గా తోలుతున్నారు. చిన్నా పిల్లలు ఆడుతూ రోడ్డుపైకి వస్తే ప్రమాదం కొనితెచ్చుకున్నట్లే. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనట్లు తెలుస్తుంది. అధికారులు కల్పించుకుని వెంటనే పాఠశాలలో పనులు చేయించాలి.

- ముల్తాంకర్ శివాజీ,
బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి, కేశంపేట

బీజేపీది రాజ్యాంగాన్ని చెరిపేసే కుట్ర


కొత్తగూడలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

కందుకూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): చరిత్రను, రాజ్యాంగాన్ని బీజేపీ ప్రభుత్వం మార్చే కుట్ర పన్నిందని జడ్పీ మాజీ చైర్మన్ తీగల అనీతారెడ్డి, జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడి ఆరోపించారు. కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం మండలంలోని కొత్తగూడ, జైత్వారం, పులిమామిడి గ్రామాల్లో ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డిలతో కలిసి నిర్వహించిన జై బాపు, జై భీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ కుట్రలను కాంగ్రెస్ తిప్పికొడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్, నాయకులు వెంకటేష్‌గౌడ్, రాణాప్రతాప్‌రెడ్డి, ఎండీ సులేమాన్, సురేందర్, బొక్క భూపాల్‌రెడ్డి, శేఖర్ గౌడ్, బొక్క సంజీవరెడ్డి, బుక్క పాండురంగారెడ్డి, ఎండీ ఖాదీర్, కుమ్మరి అంజయ్య, బొక్క నరేందర్‌రెడ్డి, శివారెడ్డి, దామోదర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, ముత్యంరెడ్డి, మైసయ్య పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్‌తో నేరాల నియంత్రణ


కొత్తపేటలోని ఓ కిరాణా షాపులో తనిఖీ చేస్తున్న సీఐ నరహరి

కేశంపేట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): విజిబుల్ పోలీసింగ్‌తో నేరాలను నియంత్రించవచ్చని కేశంపేట సీఐ నరహరి అన్నారు. విజిబుల్ పోలిసింగ్‌లో భాగంగా బుధవారం రాత్రి మండల పరిధిలోని కొత్తపేట, అల్వాల గ్రామాల్లో వాహనాలను తనిఖీ చేశారు. గ్రామంలోని కిరాణా షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. కిరాణా షాపుల్లో మద్యం, గుట్కా అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


నందిగామ: సన్నబియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు

సన్న బియ్యం పంపిణీ పేదలకు వరం

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లు రేషన్ బియ్యం పక్కదారి పట్టేదని, సన్న బియ్యం పంపిణీతో పేదలు కడుపునిండా అన్నం తింటారని ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం చించోడులో బుధవారం లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పేదల ఆకలిని తీర్చాలనే ఉద్దేశంతో ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్నారని తెలిపారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ర్యాకల శ్రీనివాస్, బాబా, శ్రీధర్‌రెడ్డి, రాజు, యాదయ్య, రఘురాం, సర్దార్, అక్బర్, ప్రసాద్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పేదలకు సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మకమని మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చేగుర్‌లో లబ్ధిదారురాలకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగ నర్సింలు, నాయకులు కుమార్‌గౌడ్, శ్రీశైలం, శివ, బుచ్చయ్య, సాములయ్య, వీరేందర్, శ్రీనివాస్‌గౌడ్, భాస్కర్, రవితేజ, రాజశేఖర్, గిరి, వెంకటాచారి పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

చేవెళ్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో పార్టీ మండల ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతూ.. బస్తీ చలో అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయానికి కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రతాప్‌రెడ్డి, ఓబీసీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఆంజనేయులుగౌడ్, బిజేపీ జిల్లా నాయకులు దేవుని శర్వలింగం, అడెట్ల శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, కుమార్‌గౌడ్, మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్ నాయకులు మల్లారెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, కృష్ణమోహన్, ఇంద్రసేనారెడ్డి, ప్రవీణ్, కరుణాకర్‌రెడ్డి, దాయకర్, అభిలాష్, ధనుష్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, భూజంగారెడ్డి, భాస్కర్, శ్రీనివాస్, జయసింహారెడ్డి ఉన్నారు.

నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇళ్లు

ఆమనగల్లు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను వేగవంతంగా చేపట్టాలని ఎంపీడీవో కుసుమ మాధురి అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ఇంటి నిర్మాణాలు చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు. ఆమనగల్లు మండలంలోని పోలేపల్లి గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. బేస్‌మెంట్ నిర్మాణం పూర్తయితే సిమెంట్ కోసం సిఫార్సు చేస్తామన్నారు. పోలేపల్లి గ్రామంలో 20 ఇళ్లకు మార్క్ చేయగా మూడు బేస్‌మెంట్ వరకు పూర్తయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ ఈశ్వర్, టెక్నికల్ అసిస్టెంట్ స్వామి పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో కుసుమ మాధురి

గ్యాస్ ధర పెంపుపై ఆందోళనలు


షాద్‌నగర్: ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

షాద్‌నగర్, ఏప్రిల్ 9: పెంచిన గ్యాస్ ధరలను నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు షాద్‌నగర్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పీఎం మోదీ దిష్టి బొమ్మను దహనం చేశారు. గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచి పేద, మధ్య తరగతి కుటుంబాలపై భారం మోపడం సరైంది కాదని నాయకులు రఘు, చెన్నయ్య ఆరోపించారు.

చౌదరిగూడలో సీపీఐ ఆధ్వర్యంలో..

చౌదరిగూడ: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగయ్య కోరారు. బుధవారం కొందుర్గు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక నిత్యావసర ధరలు భారీగా పెరిగాయని ఆరోపించారు. జిల్లేడ్ చౌదరిగూడ సీపీఐ మండల కార్యదర్శి వెంకటేష్, బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య, లింగం, కృష్ణ, రాములు, జంగయ్య, షబ్బీర్, శాంతమ్మ, కమలమ్మ పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: వంట గ్యాస్, పెట్రో ధరల పెంపును నిరసిస్తూ తలకొండపల్లి మండల కేంద్రంలో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. బస్టాండ్ కూడలిలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సంపన్నులకు కొమ్ము కాస్తూ పేదల నడ్డి విరుస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దుబ్బ చెన్నయ్య, ఏరియా కమిటీ నాయకులు పెంటయ్య, దళిత సంఘాల నాయకులు బాలు, పెరుమాళ్ల నర్సింహ, చలి సీమల చెన్నయ్య, కట్టమల్ల చెన్నయ్య, జూలపల్లి చంద్రయ్య పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సామేల్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం చౌరస్తాలో గ్యాస్ సిలిండర్లతో నిరసన తెలిపి ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బుగ్గ రాములు, నాయకులు జంగయ్య, జగన్, ఎల్లేష్, వెంకటేష్, ముసలయ్య, ఆనంద్, యాదగిరి పాల్గొన్నారు.

పేదలపై భారం మోపడమే..

ఆమనగల్లు: వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడం దారుణమని, పెంచిన ధరలు తగ్గించే వరకు పేదల పక్షాన కాంగ్రెస్ పోరాడుతుందని జిల్లా నాయకుడు ఎగిరిశెట్టి పేర్కొన్నారు. పేదలకు గ్యాస్ సిలిండర్ రూ.500కే అందిస్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కిందన్నారు. జైబాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.


ఇబ్రహీంపట్నం: నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అర్హులందరికీ పంట రుణాలు

గంప వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్, ఆమనగల్లు

ఫటా ఫట్



ఆమనగల్లు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): 'ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా అర్హులైన రైతులందరికీ పంట రుణాలు అందిస్తున్నాం. పాడి, కోళ్ల పరిశ్రమ, గొర్రెల యూనిట్లు, ట్రాక్టర్లు, వరి కోతమిషన్లు, జేసీబీలు, వ్యవసాయ పనిముట్లకు రుణాలు అందిస్తున్నాం. పౌరసరఫరాల శాఖ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం.' అని ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ అన్నారు. బుధవారం ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూలో పలు విషయాలను పంచుకున్నారు.

ఆమనగల్లు పీఏసీఎస్‌లో ఎంత మంది రైతులకు సభ్యత్వం ఉంది?

పీఏసీఎస్ పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల మండలాలకు చెందిన 6500 మంది రైతులకు సభ్యత్వం ఉంది.

ఇప్పటివరకు ఎన్ని పంట రుణాలు అందించారు?

2024-25 ఆర్థిక సంవత్సరానికి పంట రుణాల కింద రూ.3 కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రూ.2.10 కోట్లు అందించాం.

ధాన్యం కొనుగోలు ఎప్పటినుంచి ప్రారంభిస్తున్నారు?

పౌరసరఫరాల శాఖ సహకారంతో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఆమనగల్లు, కడ్తాల్, ముద్విన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాం. రెండు వారాల్లో కొనుగోళ్లు ప్రారంభిస్తాం.

కొత్తగా ఏమైనా గోదాంల ఏర్పాటుకు ప్రతిపాదించారా?

కడ్తాలలో రెండు ఎకరాల్లో గోదాం ఏర్పాటుకు ప్రతిపాదించి ప్రభుత్వానికి నివేదించాం. స్థలం కేటాయింపు పూర్తి కాగానే నాబార్డు మల్టీ సర్వీసెస్ సెంటర్ ద్వారా రూ.కోటితో గోదాం నిర్మాణం చేపడుతాం.

వచ్చే వానాకాలానికి ఏ మేర రుణాలు ఇవ్వనున్నారు?

2025-26 సంవత్సరానికి సుమారు రూ.6 కోట్లు పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించాం.

విద్య, గృహ నిర్మాణ, ఇతర రుణాలు ఏమైనా ఇస్తున్నారా?

పీఏసీఎస్‌లో సభ్యత్వం ఉండి భూమి ఉన్న రైతుల పిల్లలకు విదేశీ విద్యకు రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు రుణాలు అందిస్తున్నాం. గ్రామాల్లో ఇళ్ల నిర్మాణానికి 10 లక్షలు, పట్టణాల్లో రూ.15 లక్షలు ఇస్తున్నాం. చిరు వ్యాపారులకు రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు షరతులతో కూడిన రుణాలు అందిస్తున్నాం.


నందిగామలో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ ఈటల గణేష్, తదితరులు

పార్టీలకతీతంగా అభివృద్ధి చేయాలి

నందిగామ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని రంగారెడ్డి జిల్లా జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ ఈట గణేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జడ్పీ నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను మాజీ ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. బీఆర్ఎస్ హయాలో గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనులు చేశామని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింహులు, నాయకులు రాములు, ఎదిరె శ్రీకాంత్‌గౌడ్, కృష్ణ, సుమన్, బంట్రపు జంగయ్యగౌడ్, కుందారపు వెంకట్‌రెడ్డి, లింగం, దార సురేష్, చించేటి శివకుమార్‌గౌడ్, దామోదర్‌రెడ్డి, ఈశ్వర్‌యాదవ్, తుప్పుడు నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి, ఎర్ర వెంకటేష్‌గౌడ్, అంతయ్య, ఎర్రగారి రమేష్, బాల్‌రాజ్, రాంచందర్ యాదవ్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చేవెళ్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధిపథంలో ముందుకు తీసుకెళ్తామని చేవెళ్ల పీఏసీఎస్ డైరెక్టర్ పైండ్ల మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీఆర్ఆర్ నిధులు రూ. 5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేష్ యాదవ్, నాయకులు దర్శన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, మహమ్మద్ చాన్‌పాషా, మహమూద్, రవీందర్, జగన్‌గౌడ్, యాదయ్య, వెంకటయ్య, ఉస్మాన్, ఆజీమ్, సలీం, భిక్షపతి, పైండ్ల శ్రీకాంత్‌రెడ్డి, నర్సింలు ఉన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన


కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కేశంపేట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, 50 మందికి సర్జరీలు అవసరమని వైద్యులు తెలిపారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి సహకారంతో ఉచితంగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 50 మందికి సర్జరీలు చేయిచేందుకు బీఆర్ఎస్ తరుపున సహకారం అందిస్తామని గ్రామ మాజీ సర్పంచ్ కామ్లెకార్ నవీన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మల్లేష్ యాదవ్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు జమాల్‌ఖాన్, నరేష్‌యాదవ్, లక్ష్మయ్య, జగన్ రెడ్డి, మాధవి, దర్శన్, కృష్ణ, కల్పన, వెంకటేష్, మహేందర్ రెడ్డి, అల్లే సంతోష్, రమేష్, శ్రీను, బాలయ్య గౌడ్, వైద్య సిబ్బంది డాక్టర్ వంశీ, భాను, కవిత పాల్గొన్నారు.

అంబలి కేంద్రం ఏర్పాటు అభినందనీయం

మహేశ్వరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా అంబలి కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్యగౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మన్‌సాన్‌పల్లి చౌరస్తాలో శ్రీ ఇన్‌ఫ్రా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా ప్రతి వేసవిలో రోజుకు సుమారు 300 మందికి అంబలి పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. అలాగే తుక్కుగూడలో దేవేంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలి వేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వీరేందర్‌గౌడ్, ఇన్‌ఫ్రా ప్రతినిధులు శ్రీనివాసరావు, లలిత, బీజేపీ నాయకులు యాదయ్యగౌడ్, సుదర్శన్‌యాదవ్, మాధవాచారి, రఘుపతిగౌడ్, ముత్యం, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

షార్ట్ సర్క్యూట్‌తో టీవీలు దగ్ధం

కందుకూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిప్పలపల్లిలో మంగళవారం రాత్రి విద్యుత్ స్తంభంపై షార్ట్ సర్క్యూట్ రావడంతో రూ.25లక్షల విలువ గల ఎలక్ట్రికల్ పరికరాలు కాలిపోయాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చిప్పలపల్లి గ్రామంలోని ఎల్లమ్మ పలుగు(ఎస్సారనగర్ కాలనీ)లో అర్ధరాత్రి స్తంభంపై వచ్చిన షార్ట్‌సర్క్యూట్ రావడంతో కాలనీలోని 25 ఇళ్లల్లో టీవీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్‌లు, స్విచ్ బోర్డులు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం కాలనీలో సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.